క్లుప్తంగా

రైతుబీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని బిజిలీ పూర్ గ్రామానికి చెందిన రైతు వడ్డె పెద్దయ్య ఇటీవల మరణించాడు. దీంతో రైతుబీమా పథకం ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మృతుడి భార్య లక్ష్మికి శుక్రవారం సంగారెడ్డిలోని ఆయన నివాసంలో అందజేశారు. కాంగ్రెస్ గ్రామ నాయకులు సుధాకర్, వీరేశం, ఎర్రొళ్ల రమేశ్, పట్నం నర్సింలు, వీరన్న, మల్లేశం, శ్రీశైలం, సంగమేశ్వర్, నరేష్, వెంకయ్య, బేతయ్య పాల్గొన్నారు.

ఘనంగా డీసీఎంఎస్ చైర్మన్ జన్మదిన వేడుకలు



శివకుమార్ చేత కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని శివకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు గుండప్ప, పెంటారెడ్డి, భాస్కర్, నారాయణ, రవీందర్, వెంకటేశం, మచ్చేందర్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన వారోత్సవాలు



ఇస్నాపూర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పటాన్‌చెరు టౌన్: హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పటాన్‌చెరు పరిసర గ్రామాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించిన ఆరోగ్యంపై అవగాహన వారోత్సవాలు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సాంబరాజు మాట్లాడుతూ.. నా ఆరోగ్యం–నా హక్కు అనే ప్రధాన అంశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరానికి గాను ప్రకటించిందన్నారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు మండల పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, ఊట్ల, భానూర్, నందిగామ, వెలిమెల, రుద్రారం, ఇస్నాపూర్, ముత్తంగి, గౌతంనగర్, బీరంగూడ, గొల్లబస్తీ, శాంతినగర్ కాలనీలలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మాత్రలు అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల పరిధిలోని మావినెల్లి గ్రామంలో చెన్న బసవ మందిరం జాతరలో భాగంగా రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గుండెరావు పాటిల్, అనిల్‌పాటిల్, అంజిరెడ్డి, సంగ్‌శెట్టి, మనోహర్‌పాటిల్, బస్వరాజ్, శ్రీకాంత్ పాటిల్, రాజు, శివ్వయ్యస్వామి పాల్గొన్నారు.

స్టీరింగ్ కమిటీల నియామకం

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ సమన్వయ కమిటీతో పాటు నియోజకవర్గంలోని మండలాల స్టీరింగ్ కమిటీలను నియమించినట్లు ఎంపీ, జహీరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సభ్యులుగా బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప నియమితులయ్యారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధి స్టీరింగ్ కమిటీ సభ్యులుగా రాజశేఖర్‌గౌడ్, ముత్యాల సురేష్, ఖేడ్ మండలానికి సంబంధించి దశరథ్, శేరి రామకృష్ణ, కల్హేర్ మండలానికి అనిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నిజాంపేట నుంచి కృష్ణ, బాబూనాయక్, పెద్దశంకరంపేట నుంచి కోనం విఠల్, అనిల్‌కుమార్, మనూరుకు సంబంధించి ఈశ్వరప్ప, నిజానందరెడ్డి, సిర్గాపూర్ నుంచి గోపాల్‌రెడ్డి, శివాజీరావు, కంగ్టి నుంచి మహాదేవ్, సిద్దారెడ్డి, నాగల్‌గిద్ద మండలానికి రాజశేఖర్, మోహన్‌రెడ్డిని స్టీరింగ్ కమిటీ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- మరమ్మతులకు నోచుకోని లింక్ రోడ్లు
- కంకర తేలిన రహదారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలను కలిపే లింకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు ఏర్పడి కంకర తేలినా అధికారులు కన్నెత్తి చూడటంలేదు. అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని, కనీసం తాత్కాలిక మరమ్మతులను కూడా చేపట్టడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

– జహీరాబాద్ టౌన్



కంకర తేలిన హద్నూర్-రాంతీర్థం రోడ్డు

జహీరాబాద్ పట్టణం నుంచి అల్గోల్, తదితర గ్రామాలను కలుపుతూ వేసిన రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలింది. దీంతో ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అల్గోల్, పాట్‌పల్లి, ఎల్గోయి తదితర గ్రామాల ప్రజలు జహీరాబాద్ పట్టణానికి పనుల నిమిత్తం వస్తుంటారు. కూలీలు పనుల చేసేవారు కూడా పట్టణానికి వచ్చి ఇళ్లకు వెళ్లే సమయంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి బూచినెల్లి గ్రామం అక్కడి నుంచి కర్నాటక రాష్ట్ర సరిహద్దు వరకు గల లింకు రోడ్డు కూడా దెబ్బతింది.

గుంతలమయంగా రహదారులు

ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి–మొక్కన్‌పాడ్, రాయిపల్లి–కృష్ణపూర్, దేవరంపల్లి, బోప్పన్‌పల్లి, ఝరాసంగం–చిలమామిడి, న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్–రాంతీర్థం, శంశెల్లాపూర్–వడ్డీ, చాల్కి–కర్నాకట రాష్ట్ర సరిహద్దు, గంగ్వార్–బసంత్‌పూర్–మామిడ్గి రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. కోహీర్ మండలంలోని బడంపేట–మనియార్‌పల్లి, పోత్‌రెడ్డిపల్లి–కోహీర్, పిచరాగడి–పిచరాగడి తండా, ఖనాపూర్–సజ్జపూర్, శేఖాపూర్–బడంపేట రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

మంజూరైన నిధులు రద్దు

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల లింక్ రోడ్ల మరమ్మతుల కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.51 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడంతో టెండర్ ప్రక్రియలో జాప్యం జరిగింది. తదనంతరం టెండర్ పనులు పూర్తి కాగా అంతలోనే ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధులు రద్దవ్వడంతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి దెబ్బతిన్ని రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాలినడకన కూడా వెళ్లలేకపోతున్నాం

హద్నూర్–రాంతీర్థం రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. కొన్నేళ్ల నుంచి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలేదు. ప్రభుత్వాలు మారినా రోడ్డు గురించి పట్టించుకునేవారే కరువయ్యారు. కాలినడకన వెళ్లాలన్నా కష్టంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – విశ్వనాథ్, గుంజెట్టి

ప్రతిపాదనలు పంపుతాం

నియోజకవర్గంలోని 26 రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైన మాట వాస్తవం. అయితే ప్రస్తుతం నిధులు రద్దయ్యాయి. రోడ్ల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరూ కాగానే రోడ్లకు మరమ్మతులు చేపడుతాం. – కృష్ణ, ఏఈ, జహీరాబాద్

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూరు గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన రేణుకామాత, నాగులమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పాండు, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి మాజీ ఉపసర్పంచ్ కుమార్, గౌడ సంఘం సభ్యులు సుభాష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మతల్లి బోనాలు

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని బాన్సువాడ గ్రామ శివారులో కొలువైన బారడి పోచమ్మతల్లి వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాల మధ్యన ఊరేగింపుగా ఆలయానికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు కుస్తీ పోటీలు

బారడి పోచమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా శనివారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నగదు, ఫైనల్ విజేతలకు వెండి కడియం బహూకరించనున్నట్లు పేర్కొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్: పట్టణంలోని చారిత్రాత్మక సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13న సుప్రభాత సేవ, గణపతి పూజ, ధ్వజారోహణం, గరుడ వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న కరణ్ గజేంద్ర భారతి మహారాజ్‌చే అఖండ సప్తాహ ప్రారంభం, శేషవాహన సేవ, 15న సూర్యప్రభ వాహనసేవ, చైతన్య మహారాజ్ కీర్తన, 16న హంస వాహన సేవ, జ్ఞానేశ్వర్ మహారాజ్ చేత కీర్తన, 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని 12 గంటలకు డోలారోహణం, ప్రవచనాలు, సాయంత్రం హనుమత్ వాహనసేవ, జ్ఞాన్‌రెడ్డి మహారాజ్‌చే కీర్తన, 18న గజవాహన సేవ, శ్రీహరి మహారాజ్‌చే కీర్తన, 19న అశ్వవాహన సేవ, బాలు మహారాజ్ చేత కీర్తన, 20న గాధపూజ, రథోత్సవం, అవదూత్ మహారాజ్ చే కీర్తన, కుస్తీ పోటీలు, 21న కాల కీర్తన, నగర ప్రదర్శన, కరణ్ గజేంద్రభారతి మహారాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.



ఆలయంలో వెలసిన సీతారామచంద్రులు

దైవచింతనతో మానసిక ప్రశాంతత



కాటా సుధాను సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూర్ గ్రామంలో రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కాటా సుధాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కల్తీకల్లు తయారుచేస్తే జైలుకే..

రాయికోడ్(అందోల్): కల్తీకల్లు తయారుచేస్తే జైలు శిక్ష తప్పదని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కల్లులో అల్ప్రాజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాలు కలిపి విక్రయించే వారికి కఠినశిక్షలు తప్పవన్నారు. మత్తు పదార్థాలను కల్లులో వినియోగించే వారి వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని సూచించారు. కల్లులో కలిపే నిషేధిత మత్తు పదార్థాలతో మనిషి నాడీ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. గంజాయి, అల్ప్రాజోలం, డైజోఫం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కబ్జా కోరల్లో నాలా స్థలం

- మురుగునీరు నిల్వతో ఇబ్బందులు
- దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని నాలా కబ్జాకు గురవుతోంది. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. 14వ వార్డు పరిధిలోని రాచన్నపేట ప్రాంతంలో ఉన్న 173, 174 సర్వే నంబర్‌లో నాలా ఉంది. ఈ నాలా ఇరిగేషన్‌శాఖ పరిధిలోకి వస్తుంది. వరదనీటితో పాటు మురుగునీరు ఈ నాలా గుండా బయటకు వెళ్తోంది. అయితే కొందరు నాలాను కబ్జా చేసి అడ్డంగా గోడను నిర్మాణం చేపడుతున్నారు. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా ఆగిపోవడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.



నాలా స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణం

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు

కబ్జాకు గురవుతున్న నాలా స్థలాన్ని కాపాడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇరిగేషన్‌శాఖ నిర్లక్ష్యంతోనే నాలా కబ్జాకు గురవుతోంది. నాలా కుదించుకుపోతున్న స్పందించడంలేదు. ఇప్పటికైనా మున్సిపల్, ఇరిగేషన్‌శాఖ అధికారులు రాజకీయ నాయకుల వత్తిళ్లకు లొంగకుండా వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి నాలా స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

– నామ రవికిరణ్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్



నాలా కబ్జాకు గురికావడంతో నిలిచిన మురుగునీరు

నేడు బీఆర్ఎస్ సమావేశం

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా శనివారంపటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 4గంటలకు పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో అర్ధరాత్రి ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ సృష్టించిన సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడకు చెందిన ఖదీర్ గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం చోరీ అయిందని మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కిటికీకి తల కొట్టుకున్నాడు. దీంతో పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎవరికీ చెప్పకుండా అక్కడ నుంచి వెళ్లిన ఖదీర్ అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఉన్న టవర్ పైకి ఎక్కాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకొని పోలీసుల సహకారంతో ఖదీర్‌ను కిందకు దింపారు. అనంతరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.



టవర్ ఎక్కిన ఖదీర్

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ



వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామంలో బీరప్ప ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు 3 రోజులుగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అక్కమహాంకాళి, కామరాతి సమేత, బీరప్ప సహిత, నందీశ్వర, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులు బీరప్పస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

◆ ఘనంగా బీరప్ప జాతర ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో శుక్రవారం బీరప్ప జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలను సమర్పించారు. అనంతరం బీరప్ప మైలలు, లింగాలు దాచుట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ తాగునీరు వృథా



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలో తాగునీరు వృథా అవుతోంది. గ్రామంలోని నల్లాలకు ట్యాప్‌లు లేకపోవటంతో నీరు వృథాగా పోతోంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తాగునీటి వృథాను అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

◆ సన్మానం

జహీరాబాద్ టౌన్: బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్లను శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్‌గా హరీశ్, జహీరాబాద్ కన్వీనర్‌గా పురుషోత్తం, కోకన్వీనర్‌లుగా సతీష్‌కుమార్, జగన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అల్లాడి బక్కయ్యగుప్తా, పట్టణ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రనాయక్ తదితరులు కలిసి వీరిని సన్మానించారు.

◆ రహదారి పనులను పూర్తి చేయండి

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్–పిట్లం మండల కేంద్రాల మధ్యలో అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నాం అనిల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డుపై కంకర వేసి అసంపూర్తిగా వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులను పూర్తి చేయాలని కోరారు.

◆ 16న జ్వాలాముఖి హోమం

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని ఎడ్లరేగడితండా జ్వాలాముఖి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 16వ తేదీన జ్వాలముఖి హోమంతో పాటు అన్నదాన వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగల్‌చంద్ మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని సూచించారు.

◆ మైనార్టీలను కలిసిన సురేష్‌శెట్కార్

జహీరాబాద్: పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌శెట్కార్ రంజాన్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం మైనార్టీ అడ్వయిజర్ కమిటీ మాజీ కార్యదర్శి సద్రుద్దీన్‌గారిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మైనార్టీ నాయకులతో కలిసి సమావేశమయ్యారు.

◆ ఆర్థికసాయం అందజేత



కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్ (నల్లవాగు)కు చెందిన చాకలి పారమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో వైద్యం చేయించుకోలేని దీన పరిస్థితి. ఈ విషయం తెలుసుకున్న కల్హేర్ మండలానికి చెందిన ప్రవాస భారతీయుడు గురప్రు మశ్చందర్ శుక్రవారం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వైద్య చికిత్సల నిమిత్తం రూ.25వేల నగదును బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా మశ్చందర్‌కు బాధితురాలి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమం

సంగారెడ్డి టౌన్: ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపూర్ జగన్ అన్నారు. రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలోని ఐబీ నుంచి పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించే రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సేవా సమితి కార్యదర్శి దమ్మగల్ల మురారీ, సురేష్, రాజు నాయక్, బాలు, ప్రమోద్ పాల్గొన్నారు

